క్లుప్తంగా

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి

డీఈఓ తాహెరా సుల్తానా



గుడివాడరూరల్: విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనం తయారీకి వాడుతున్న పదార్థాల విషయంలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని కృష్ణా జిల్లా విద్యాశాఖ అధికారి తాహెరా సుల్తానా ఆదేశించారు. మండలంలోని గంగాధరపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాశిరకంగా ఉందంటూ వచ్చిన ఫిర్యాదులపై ఆమె స్పందించారు. ఆ పాఠశాలలకు మధ్యాహ్న భోజనాన్ని సరఫరాచేస్తున్న మోటూరులోని అక్షయపాత్ర వంటశాలలను విద్యాశాఖ అధికారులతో కలసి ఆమె బుధవారం పరిశీలించారు. బియ్యం నాశిరకంగా, పురుగులతో ఉండటాన్ని గుర్తించి, వెంటనే బియ్యాన్ని మార్చాలని అక్షయపాత్ర నిర్వాహకులను ఆదేశించారు. డీఈఓ ఆదేశాల మేరకు మార్కెట్ యార్డ్‌లోని ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి నాణ్యమైన బియ్యం లోడును తెప్పించారు. భోజనంలో నాణ్యతా ప్రమాణాలను పాటించక పోతే చర్యలు తప్పవని అక్షయపాత్ర నిర్వాహకులను డీఈఓ హెచ్చరించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం రాజీ పడకుండా నిధులు కేటాయిస్తోందని పేర్కొన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించే బాధ్యత మండల విద్యాశాఖ అధికారులపై ఉందన్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలుపై నిఘా ఉంటుందని స్పష్టంచేశారు. డీవైఈఓ సుబ్బారావు, ఎంఈఓలు శేఖర్‌సింగ్, బాలాజీ పాల్గొన్నారు.

మహిళకు బడ్డీ కొట్టు వితరణ



నాగాపురం(పెదపారుపూడి): మండలంలోని నాగాపురం గ్రామానికి చెందిన గొట్టుముక్కల భాగ్యమ్మకు రూ.30 వేల విలువైన బడ్డీ కొట్టును ఎంపీపీ గోగం సురేష్ చేతుల మీదగా బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ నాగాపురం గడప గడపకు కార్యక్రమంలో భాగ్యమ్మ ఇంటింకి వెళ్లగా సాయం చేయాలని ఎమ్మెల్యేకు మొర పెట్టుకుందన్నారు. స్పందించిన ఎమ్మెల్యే సొంత ఖర్చుతో బడ్డీ కొట్టు పెట్టిస్తానని ఇచ్చిన హామీ నెరవేర్చారన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలతో పాటు సొంత నిధులతో పేదలకు ఆదుకుంటున్న ఎమ్మెల్యేను ప్రజలు ఎప్పుడూ గుర్తుపెట్టుకుంటారన్నారు. మండల సచివాలయాల కన్వీనర్ జాజుల చిన్నారి, నాగాపురం, పాములపాడు సర్పంచ్‌లు నాగదేశి సుబ్రహ్మణ్యం, ప్రత్తిపాటి హర్షవర్ధన్, వైఎస్సార్ సీపీ నేతలు కుమ్మరి రాజేష్, చిగురుపాటి శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

150 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం



పామర్రు(తోట్లవల్లూరు): తోట్లవల్లూరు మండలం కనిగిరిలంక గ్రామంలో 150 లీటర్ల బెల్లపు ఊటను ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం ధ్వంసం చేశారు. ఉయ్యూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్ మెంట్ బ్యూరో ఇన్స్పెక్టర్ ఎంఏ ఖదీర్ దీనికి సంబంధించిన వివరాలు వెల్లడించారు. మండల పరిధిలోని కనిగిరి లంక, మునగాల లంక గ్రామాల్లో విస్తృత దాడులు నిర్వహించామని తెలిపారు. కనిగిరిలంక గ్రామానికి చెందిన గొన నాగఫణి కుమార్ వద్ద 150 లీటర్ల బెల్లపు వూటను కనుగొని ధ్వంసం చేసి కేసు నమోద చేశామన్నారు. ఆయా గ్రామాల్లో సారాయి తాగటం వలన కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సారాయి కాచి, నిల్వచేసుకునే అవకాశం ఇచ్చిన యజమానులపై కూడా కేసులు నమోదు చేస్తామన్నారు. నాటు సారాయి స్థావరాలపై సమాచారం ఉంటే 94409 02451కు తెలియజేయాలన్నారు. సమాచారం ఇచ్చినవారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది స్థానికులు పాల్గొన్నారు.

అందరికీ సంక్షేమమే 'సురక్ష' లక్ష్యం



చిగురుకోట గ్రామ సభలో సర్టిఫికెట్లు అందిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్



పామర్రులో ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, తదితరులు



గుడివాడలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఆర్డీవో, ఎంపీపీలు



ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న కమిషనర్

ముదినేపల్లి రూరల్: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలనే ధ్యేయంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. మండలంలోని చిగురుకోట సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమానికి సంబంధించి గ్రామసభ బుధవారం నిర్వహించారు. సభలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులై ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇంకా పొందని వారిని గుర్తించి లోటుపాట్లు సరిచేసి వారికి సంక్షేమ ఫలాలు అందిస్తున్నట్లు చెప్పారు. వలంటీర్లు ఎంతో సేవాభావంతో తమ పరిధిలోని గడపగడపకు తిరుగుతూ ప్రభుత్వ సేవలను నిస్వార్థంగా అందజేస్తున్నారన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందడానికి కార్యాలయాల చుట్టూ తిరగకుండా వలంటీర్లే ఇళ్ల వద్దకు వెళ్లి అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇలాంటి మహత్తరమైన కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి జగనన్న ప్రజల మనసులో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. 300 మందికి పైగా లబ్ధిదారులకు వివిధ రకాల సేవలకు సంబంధించి సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, ఎంపీడీవో పీ మల్లీశ్వరి, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, ఎంపీటీసీ సభ్యురాలు పేరం నాగలక్ష్మీ, చినకామనపూడి సర్పంచ్ చిట్టూరి నాంచారయ్య, వైస్ ఎంపీపీ రాచూరి రాధా, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు మోట్రు ఏసుబాబు, నేతలు శీలం రామకృష్ణ, షేక్ అల్లాభక్షు, బొర్రా శేషుబాబు, ఈడే వెంకటేశ్వరరావు, కోమటి విష్ణువర్ధన్, గంటా కోటేశ్వరరావు, పలు శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

మండవల్లి: మండలంలోని లోకుమూడిలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉండి సంక్షేమ ఫలాలు అందని లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులను జగనన్న సురక్ష కార్యక్రమం ఉద్దేశమన్నారు. ఆదేరోజున వారికి కావలసిన సర్టిఫికెట్లు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. దరఖాస్తుదారులకు ఎమ్మెల్యే సర్టిఫికెట్లు అందజేశారు. ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ (రాము), సర్పంచ్ కరేటి నాగమణి, ఏఎంసీ ఉపాధ్యక్షుడు జంపన కొండరాజు, తలాని ధనలక్ష్మి, మెండా సురేష్, కరేటి శివకృష్ణ, తలారి అన్నిబాబు పాల్గొన్నారు.

గుడివాడరూరల్: రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ పేర్కొన్నారు. గుడివాడ పట్టణంలోని 25వ వార్డు సచివాలయం వద్ద బుధవారం నిర్వహించారు. తొలుత వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు మండలి హనుమంతరావు, స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు పాలేటి శివసుబ్రహ్మణ్యం(చంటి), వైఎస్సార్ సీపీ పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు రేమల్లి నీలాకాంత్, మున్సిపల్, రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

గుడివాడరూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష పథకం అమలు వలంటీర్ల వలనే సాధ్యమవుతుందని ఎంపీపీ గద్దే పుష్పరాణి అన్నారు. మండలంలోని దొండపాడు సచివాలయం వద్ద వలంటీర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో బుధవారం ఎంపీపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ జగనన్న సురక్ష వలన కలిగే ప్రయోజనాలను వలంటీర్లు ప్రజలకు వివరించాలన్నారు. మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా వలంటీర్లు కృషి చేయాలన్నారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి సమస్యలను పరిష్కరించేలా చూడాలని కోరారు. ఎంపీడీవో వెంకటరమణ, మండల సచివాలయాల కన్వీనర్ కారే జోసఫ్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గద్దే రాము, పంచాయతీ కార్యదర్శి స్నేహలత, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పామర్రు: స్థానిక పామర్రు సచివాలయం–2లో జగనన్న సురక్ష శిబిరం బుధవారం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ మాట్లాడుతూ జగనన్న సురక్ష ద్వారా 900 మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు ఆరేపల్లి శ్రీనివాసరావు, ఆరుమళ్ల రమాదేవి, మండల ఆర్బీకే అధ్యక్షులు ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ , ఉప సర్పంచ్‌లు కె.కస్తూరి, డి.బాల వెంకటేశ్వరరెడ్డి, ఎంపీటీసీలు టీ శ్రీనివాసరావు,పీ రత్నకుమారి, కో ఆప్షన్ సభ్యులు ఎండీ హస్మతుల్లా, మండల సమాఖ్య అధ్యక్షురాలు ధనాల కృపావతి,గ్రామ కార్యదర్శి సలీం, సచివాలయ గ్రేడ్ కార్యదర్శి ఎం.మధుబాబు, తహసీల్దార్ వీవీ భరత్‌రెడ్డి, ఎంపీడీవో వై.రామకృష్ణ,వీఆర్వో ఆంజనేయులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తోట్లవల్లూరు మండలంలో..

మండలంలోని బొడ్డపాడు గ్రామ సచివాలయం వద్దజగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ జొన్నల రామ్మోహన్‌రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ నడకుదురు రాజేంద్ర, ఎంపీటీసీ దారం రోజా రాణి, సర్పంచ్ మూడే శంకర్, మండల స్థాయి అధికారులు, పంచాయతీ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

గుడివాడరూరల్(నందివాడ): నందివాడ మండలం తుమ్మలపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆర్డీవో పి.పద్మావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దరఖాస్తు చేసుకున్న 450 మందికి ధ్రువీకరణ పత్రాలను ఆర్డీవో అందజేశారు. ఎంపీపీ పెయ్యల ఆదాం మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పథకాలను రూపొందిస్తున్నారన్నారు. గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు గూడపాటి వెంకటేశ్వరరావు, కందుల నాగరాజు, పరిమే అమృతబాబు, మురళీ, సర్పంచ్‌లు మోహన్ శశి ప్రవీణ్‌కుమార్, సింగాల రాధాకృష్ణ, ఎంపీడీవో కేవీ కోటేశ్వరరావు, తహసీల్దార్ భవన్నారాయణ, ఈవోపీఆర్డీ జి.శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు వెన్నా ప్రభావతి, వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ, రెవెన్యూ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పమిడిముక్కల: మండలంలోని గురజాడ సచివాలయంలో బుధవారం జగనన్న సురక్ష క్యాంపు నిర్వహించారు. 200 మంది దరఖాస్తుదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజ్యలక్ష్మి, ఈవోఆర్డీ కె.వెంకటేశ్వరరావు, కార్యదర్శి రమణ, వైస్ఎంపీపీలు కొడమంచిలి మహేష్, గంజాల సీతారామయ్య, ఎంపీటీసీ ఊబ మల్లేశ్వరి, ఉప సర్పంచ్ షుకూర్ తదితరులు లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

జగనన్న సురక్షతో ప్రజలకు భరోసా



కైకలూరు మండలం వరహాపట్నంలో ధ్రువపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు అందించడానికి ప్రారంభించిన జగనన్న సురక్షతో ప్రజలకు భరోసా ఏర్పడిందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. కైకలూరు మండలం వరహాపట్నం, కలిదిండి మండలం మూలలంక గ్రామ సచివాలయాల వద్ద నిర్వహించిన కార్యక్రమంలో దరఖాస్తుదారులకు వివిధ ధ్రువపత్రాలను బుధవారం ఎమ్మెల్యే డీఎన్నార్ అందజేశారు. బిడ్డల్లాంటి వలంటీర్లపై సంఘ విద్రోహకారులు అంటూ పవన్ కల్యాణ్ అభాండాలు వేయడం అత్యంత దారుణమని ఆయన అన్నారు. అనంతరం ఆయా సచివాలయాల వద్ద మొక్కలు నాటారు. ఎంపీపీలు అడవి కృష్ణ, చందన ఉమామహేశ్వరరావు, సర్పంచ్‌లు ఉప్పలపాటి నాగమణి, మహాదేవ విజయబాబు, కలిదిండి ఏఎంసీ చైర్మన్ అయినాల బ్రహ్మాజీరావు, వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, ఎంపీటీసీ సభ్యులు పండు గాంధీప్రసాద్, రావడి బాలబాలాజీ, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు చెరుకువాడ బలరామరాజు, గద్దె ఆనంద్, ఉప సర్పంచ్ గంగుల ఆంజనేయులు, కత్తుల రమేష్, అందుగుల యాకోబు, కోనాల అనిత, ఉప్పలపాటి జయదేవ్ కుమార్, చిలిమంత నాగరాజు, తహసీల్దార్లు బి.మురళీకృష్ణ, స్వామి, ఎంపీడీవో రాంబాబు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పీఏసీఎస్ అధ్యక్షులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడలపై దృష్టి సారించాలి

ఎమ్మెల్యే డీఎన్నార్



కైకలూరు: క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడుతున్నాయని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. కలిదిండి మండలం పడమటిపాలెంలో వాలీబాల్ టోర్నమెంట్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువతీ యువకులు ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటు పడకుండా గ్రామీణ క్రీడలపై ఆకర్షితులు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, సర్పంచ్ సాన మీనా సరస్వతి, ఏఎంసీ వైస్ చైర్మన్ పాము రవి, ఉపాధ్యక్షుడు పాము రవికుమార్, పాతాళ భోగేశ్వర స్వామి దేవస్థాన ధర్మకర్త చిట్టూరి బుజ్జి, సాన రాము, చిట్టూరి నాంచారయ్య, వేగ్నేశ శ్రీను, సూదాబత్తుల నరసింహారావు, చిట్టూరి రాంబాబు పాల్గొన్నారు.

హైస్కూల్‌లో ప్రవేశాలు

మండవల్లి: బడికి రాని ఇద్దరు విద్యార్థులను సీఆర్పీ గుర్తించి బడిలో చేర్పించారు. మొఖాసా కలవపూడికి చెందిన జయమంగళ ఈశ్వర బాబు, సంతోష్ పెరికెగూడెం యూపీ స్కూల్లో ఎనిమిదో తరగతి వరకూ చదివి మానివేశారు. లింగాల కాంప్లెక్స్ సీఆర్పీ సుబ్రహ్మణ్యం వారిని గుర్తించి తల్లిదండ్రులతో మాట్లాడి చిన్నారులను మండవల్లి హైస్కూల్లో తొమ్మిదో తరగతిలో బుధవారం చేర్పించారు. హెచ్ఎం పీవీఎస్ఎస్‌జీ ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యోపకరణాల పంపిణీ



కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండల అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో బుధవారం మొవ్వ మండల పరిధిలోని కూచిపూడి, ధర్మాపురం, పెదపూడి గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విద్యోపకరణలు పంపిణీ చేశారు. కూచిపూడి ప్రాథమిక పాఠశాల పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్సిళ్లు, జామెట్రీ బాక్సులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల పీడీ మణి ప్రసాద్, కొప్పుల రాజేంద్ర, అన్నవరపు రవి, పాగోలు రమేష్ బాబు, జయరాజు, సహదేవుడు, సుబ్రమణ్యం, రామారావు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

వేలం నిర్వహణ

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో వివిధ అంశాలకు సంబంధించి బుధవారం బహిరంగ వేలం నిర్వహించారు. గుడివాడ డివిజన్ ఎండోమెంట్స్ ఇన్‌స్పెక్టర్ వి.సుధాకర్ ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. ఆలయంలో ఏడాదిపాటు వాహనాల పార్కింగ్‌కు రుసుము వసూలు హక్కుకు వేలం నిర్వహించగా రూ.4.11 లక్షలకు పాట దక్కించుకున్నారు. కొబ్బరి చెక్కలు పోగు చేసుకునేందుకు ఏడాదికి రూ.3.36 లక్షలు, కోడిగుడ్లు తీసుకునేందుకు, ఆవు పాలు, కొబ్బరికాయలు, పూజా ద్రవ్యాలు విక్రయాలకు సంబంధించిన వేలంలో రూ.4.50 లక్షల ఆదాయంగా వచ్చింది. స్వామివారికి భక్తులు సమర్పించిన ధాన్యానికి వేలం నిర్వహించగా క్వింటాకు రూ.2,020, బియ్యం క్వింటాకు రూ.2,550 చెల్లించేలా పాట దక్కించుకున్నారు. ఆలయ చైర్మన్ శొంఠి నాగరాజు, సహాయకమిషనర్ ఎస్. సంధ్య, పాలకవర్గ సభ్యులు ఆనంద దాసు శివనాగేంద్ర పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

కైకలూరు: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కైకలూరు పట్టణ సీఐ ఆకుల రఘు చెప్పారు. స్థానిక రవీంద్ర భారతీ స్కూల్ విద్యార్థులు ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై నిర్వహించిన ర్యాలీలో ఆయన ముఖ్య అతిథిగా బుధవారం పాల్గొన్నారు. సీఐ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకానికి ప్రత్యామ్నాయంగా కాటన్ బ్యాగ్‌లను వినియోగించాలని సూచించారు. ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించడానికి అందరూ పాటుపడాలన్నారు. కార్యక్రమంలో రవీంద్ర భారతి స్కూల్ డీన్ శ్రీకాంత్ , ప్రిన్సిపల్ శ్యామల, అధ్యాపకులు పాల్గొన్నారు.

వలంటీర్లు.. వారధులు

ప్రతి ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు అందేలా చేయడంలో వలంటీర్ల పాత్ర కీలకమైనది. ముఖ్యంగా లబ్ధిదారులకు వలంటీర్లు చేస్తున్న సేవలు వెలకట్టలేనివి. ప్రభుత్వం ఎంతో ముందు ఆలోచనతో ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తుంది. వలంటీర్లు సైతం ఉద్యోగాన్ని సేవా దృక్పథంతో నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. వలంటీర్ల వ్యవస్థపై అసత్య ఆరోపణలు చేయడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వలంటీర్ల ద్వారా ఎలాంటి పరిస్థితుల్లో ఏ రకమైన సేవలు పొందామో ప్రజలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. – సాక్షి నెట్‌వర్క్

సేవలకు వెలకట్టలేం



గ్రామ వలంటీర్లు మాలాంటి వారికి అందిస్తున్న సేవలకు వెలకట్టలేం. గతేడాది నా భర్త చనిపోగా వలంటీర్ నా ఇంటికే వచ్చి వివరాలు నమోదు చేసుకుని వారం వ్యవధిలోనే నా భర్త మరణ ధ్రువీకరణ పత్రం అందజేసింది. ఆ వెంటనే వితంతు పింఛనుకు దరఖాస్తు చేయించగా నెలల వ్యవధిలోనే నాకు పింఛను మంజూరైంది. నేను ప్రతి నెలా 1వ తేదీనే నా ఇంటి వద్దనే వలంటీర్ నుంచి పింఛను తీసుకుంటున్నాను. ఇలాంటి సేవలను అందిస్తున్న వలంటీర్లు అభినందనీయులు.

–గాజులపల్లి సామ్రాజ్యం, లింగాల, ముదినేపల్లి రూరల్

కష్ట కాలంలో ఆదుకుంది..



కరోనా సమయంలో నా భర్త మృతి చెందారు. నాకు కూడా ఆసమయంలో కరోనా పాజిటివ్ వచ్చింది. మా వలంటీర్ ఆరేపల్లి విజయలక్ష్మి ఆసమయంలో ధైర్యంగా మా ఇంటికి వచ్చింది. నాకు కావాల్సిన అన్ని అవసరాలను తీర్చి నన్ను ఆదుకుంది. నాకు కావాల్సి మందులను, ఇంటి అవసరాలను అడిగి తెలుసుకుని కన్న బిడ్డలా సేవలు చేసింది. ఆనాడు ఆమె ఆదుకోవడం వల్లే నేడు ఈ విధంగా ఆరోగ్యంగా ఉండగలుగు తున్నా. విజయలక్ష్మి సేవలను నా జీవితంలో ఎప్పటికి మర్చి పోలేను.

–మాదుగుల సత్యవతి, పామర్రు

తప్పుడు ప్రచారం మానుకోవాలి..



మా వలంటీర్ అంకితభావంతో పనిచేస్తున్నారు. పథకాల గురించి వివరించి దరఖాస్తు చేయించడంతో పథకాలన్నీ అందుతున్నాయి. నా భార్యకు వికలాంగ పెన్షన్, అబ్బాయికి విద్యాదీవెన, వసతిదీవెన, నాకు ఆటోకు రూ.10 వేలు అందుతున్నాయి. అలాగే ఇంటి నిర్మాణానికి రుణం మంజూరైంది. వలంటీర్ ఎప్పటికప్పుడు సర్వీస్ చేయడం వల్లే ఇవి వచ్చాయి. ఇలా బాగా పనిచేస్తున్న వలంటీర్లపై తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలి.

–వీరంకి ఏడుకొండలు, అగినపర్రు, పమిడిముక్కల మండలం

నా లాంటి వృద్ధులకు మేలు..



గతంలో అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరాను. అప్పుడు మా వలంటీర్ అజ్మీర్ గోపి విజయవాడ ఆస్పత్రికి వచ్చి పింఛన్ ఇచ్చాడు. వలంటీర్ పింఛన్ ఇవ్వటం ద్వారా టిఫిన్, పాలు, అరటి పండ్లు కొనేందుకు ఇబ్బంది లేకుండా పోయింది. ప్రతి నెలా 1వ తేదీన ఉదయాన్నే వచ్చి పింఛన్ ఇస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి తీసుకుని వచ్చిన వలంటీర్ వ్యవస్థ నాలాంటి వృద్ధ మహిళలకు ఎంతగానో సాయం పడుతుంది. నిజంగా ముఖ్యమంత్రి రుణం తీర్చుకోలేం.

–కోండ్రు నిర్మల, పెదపారుపూడి

తెల్లవారుజామునే పింఛన్



నా పేరు ఉచ్చుల సుందరరావు. నాది మండవల్లి గ్రామం. సీఎం జగన్ దయవల్ల రూ. 2,750 పింఛన్ ప్రతి నెలా అందుతోంది. నా చేతికి పింఛన్ వలంటీర్ మెండ అలేఖ్య వచ్చి 1వ తేదీ తెల్లవారుజామున ఇస్తుంది. నాకు ఎవ్వరూ లేరు. పింఛన్ ద్వారానే నా జీవితం సాఫీగా సాగుతోంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

ప్రతి గడపలో సంక్షేమ కాంతులు

- పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్
- కాజ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం



వృద్ధురాలికి అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్

మొవ్వ: రాష్ట్ర ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో అమలవుతున్న సంక్షేమ పథకాలతో, నవరత్నాలతో గడప గడపలో సంక్షేమ కాంతులు విరజిల్లుతున్నాయని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ మొవ్వ మండలం కాజ సచివాలయం–1లో నాయకులు, కార్యకర్తలతో కలిసి పర్యటించారు. గడిచిన నాలుగేళ్ల కాలంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రజలకు ఏ మేరకు లబ్ధిచేకూరిందో ఇంటింటికి వివరించారు. అలాగే ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికై తగుచర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కైలే అనిల్ మాట్లాడుతూ సీఎం జగన్ మెహన్ రెడ్డి రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికై కృషి చేస్తున్నారని, వలెంటరీ, సచివాలయ వ్యవస్థలను ప్రవేశ పెట్టి ప్రభుత్వ పథకాలను ఇంటి ముంగింటికే అందిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే దృష్టికి అంతర్గత రహదారులు కావాలని, విద్యుత్ స్తంభాలు కావాలని ప్రజలు కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజులపాటి పార్వతి, ఎంపీపీ కొండేటి ఇందిర, గ్రామ సర్పంచ్ కొడాలి భవాని, ఎంపీటీసీ పేకేటి వెంకట లక్ష్మి, ఉపసర్పంచ్ మంద శ్రీనివాస రెడ్డి, తహసీల్దార్ సీహెచ్ వీరాంజనేయులు, సచివాలయాల మండల కన్వీనర్ సమ్మెట ఆంజనేయులు, పీఏసీఎస్ చైర్మన్ జోగి రామచంద్రరావు, పార్టీనాయకులు మర్రిరెడ్డి ఖాజిరెడ్డి, పేకేటి సీతారామిరెడ్డి, వేల్పూరి వెంకయ్య, కొడాలి నాగరాజు, రాయవరపు రాజేష్, పంచాయతీ పాలక మండలి సభ్యులు, పలు శాఖల అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆక్వా రంగానికి ప్రభుత్వం చేయూత

ఎమ్మెల్యే డీఎన్నార్



వరహాపట్నంలో ఫిష్ ఆంధ్ర వాహనాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆక్వా రంగానికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తున్నారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వర రావు (డీఎన్నార్) అన్నారు. వరహాపట్నం సచివాలయ వద్ద మత్స్యశాఖ ద్వారా రూ.4.40 లక్షల విలువైన ఫిష్ ఆంధ్ర చేపల విక్రయ వాహనాన్ని సీతనపల్లి గ్రామానికి చెందిన ఉచ్చుల గ్రేసమ్మ దంపతులకుఎమ్మెల్యేబుధవారంఅందించారు. మత్స్యశాఖ సహాయ సంచాలకులు షేక్ చాన్ బాషా మాట్లాడుతూ రెండు ఐస్ బ్యాక్సులు, 25 లీటర్ల వాటర్ ట్యాంకు, ఎలక్ట్రానిక్ కాటా, జీపీఎస్ ట్రాకింగ్ ఉంటుందన్నారు. మత్స్యశాఖ అభివృద్ధి అధికారి భవిత, మత్స్యశాఖ సహాయకులు పాల్గొన్నారు.

గ్రీన్ విలేజ్ నిర్మాణాల పరిశీలన

లబ్ధిదారులు త్వరితగతిన ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని ఎమ్మెల్యే డీఎన్నార్ చెప్పారు. కైకలూరు గ్రీన్ విలేజ్‌లో నిర్మాణాలను ఆయన బుధవారం పరిశీలించారు. తక్కువ ధరకే ఆర్థీ సంస్థ నిర్మాణాలు చేపట్టడం అభినందనీయమన్నారు. నిర్మాణ సంస్థ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి నాక్‌లో 'ఏ' గ్రేడ్

కైకలూరు: నేషనల్ అసెస్‌మెంట్, అక్రిడిటేషన్ కౌన్సిల్ (నాక్) బెంగుళూరు ద్వారా కైకలూరు ఎర్నేని వెంకటనాగేశ్వరరావు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ 'ఏ' గ్రేడ్ సాధించిందని ప్రిన్సిపాల్ డాక్టరు బి.రఘునాథరెడ్డి బుధవారం చెప్పారు. కళాశాల 3వ సైకిల్ అక్రిడిటేషన్‌లో భాగంగా 3.13 సీజీపీఏతో 'ఏ' గ్రేడ్ సాధించిందని పేర్కొన్నారు. పూర్వపు కృష్ణా జిల్లాలో అత్యధిక న్యాక్ స్కోర్ సాధించిన మొదటి ప్రభుత్వ కళాశాలగా నిలిచిందన్నారు. బోధన, అభ్యసన పద్ధతులు, పరిశోధన, విద్యార్థుల సామాజిక సేవలను పరిగణలోకి తీసుకోవడంతో ఈ ఘనత సాధించామన్నారు. ప్రకటించిన గ్రేడ్ గుర్తింపు 2023 నుంచి 2028 వరకు వర్తిస్తుందన్నారు. 2017లో న్యాక్ 'బీ' ప్లస్‌తో 2.61 గ్రేడ్ పాయింట్లు సాధించగా 2023లో న్యాక్‌లో 'ఏ' గ్రేడ్‌తో 3.13 పాయింట్లు సాధించడంపై కమిషనర్ ఆఫ్ కాలేజీయేట్ ఆఫ్ ఎడ్యుకేషన్ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ అభినందించారని తెలిపారు.

రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభం



మొవ్వ: పామర్రు–మొవ్వ రోడ్డులోని పెడసనగంటి పాలెం శివారులోని కొత్తకాలవ డ్రాపు నుంచి మొవ్వ గ్రామంలోని విద్యుత్ సబ్ స్టేషన్ వరకు రోడ్డు మరమ్మతుపనులను బుధవారం ప్రారంభించారు. రూ.20 లక్షల నిధులతో చేపట్టనున్న ఈ పనులను జెడ్పీటీసీ రాజులపాటి పార్వతి, ఎంపీపీ కొండేటి ఇందిర ప్రారంభించారు. పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ సూచనల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. రూ.20 లక్షలతో మరమ్మతులు తక్షణం చేయిస్తామని ఎమ్మెల్యే కై లే అనిల్ కుమార్ హామీ ఇచ్చిన విధంగా 24 గంటల్లో పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు తాతా రజిని, వాకా బాలకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షులు కైల శ్రీవల్లి, నాయకులు తాతా రాంబాబు, అమర బాలేశ్వరరావు, అయ్యంకి నాగార్జున, కొండేటి చందు, గొర్రుముచ్చు రాజేష్, కే రమేష్ తదితరులు పాల్గొన్నారు.